# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-01-2007, పెదకాపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం యజ్ఞ, దాన, తపస్సులను విడిచి పెట్టవద్దు అని పరమాత్మ చెప్పాడు. మనం స్వార్థం లేకుండా, కర్తృత్వం లేకుండా ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము. మీకు ఉన్న ధనాన్నికాని, తెలివినికాని, అధికారాన్ని కాని ఇలా భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సమాజ శ్రేయస్సుకోసం ఉపయోగిస్తూ ఉంటే అది అంతా యజ్ఞమే. మీలో ధనవంతులు ఎవరైనా ఉంటే ఆర్థికంగా వెనుకబడిన వారికి రజోగుణంతో కాకుండా, తమోగుణంతో కాకుండా, సాత్వికబుద్ధితో సహాయ సహకారములు అందిస్తే అది దానం. అంటే మనం ఏదైనా ఇచ్చేటప్పుడు మంచి హృదయంతో ఇస్తే స్వీకరించినవారు సుఖపడతారు, మనం సుఖపడతాము. శరీరము, ఇంద్రియాలు, మనస్సు వీటిని స్వాధీనం చేసుకోవటానికి మనం చేసే సాధన అంతా కూడా తపస్సు. మనస్సును ఎండింపచేయటం తపస్సు. లోకసంక్షేమం కోసం భగవంతుడు అనేక అవతారాలు ధరించాడు. అందులో కూర్మావతారం ఒకటి. ఈ పెదకాపవరంలో భగవంతుడు కూర్మావతారంలో వెలిసాడు, ఇక్కడ స్వామి వారిని దర్శించకుండా ఎవరూ వెళ్లవద్దు. మనకు ఈశ్వరుడి పట్ల భక్తి కుదిరితే, నిష్ఠ కుదిరితే మానసికఆరోగ్యం వస్తుంది, శారీరకఆరోగ్యం వస్తుంది. సర్వేశ్వరుడి పట్ల ఆ భక్తి కుదరటం కష్టం. పరమేశ్వరుడు విష్ణురూపంలో ఉండవచ్చు, శివరూపంలో ఉండవచ్చు. ఆయన ఏ రూపంలో ఉన్నా ఆయనను ఉపాసన చేసి, మన హృదయంలో నిలబెట్టుకొని ఆరాధిస్తూ తరించవలసిన అవసరం జీవకోటికి ఉంది. భక్తి, విశ్వాసం, ధ్యానం. మనకు ముందు భక్తి కలగాలి, భక్తి కలిగితే విశ్వాసం పెరుగుతుంది. విశ్వాసం పెరిగితే ఆ రూపాన్ని ధ్యానం చేస్తాము.

మీరు తరించటానికి భగవంతుడి అవతారాలలో ఏ రూపం మీకు ఇష్టం అయితే ఆ రూపాన్ని మీరు ధ్యానం చేయవచ్చు. ఒక్క విషయం మీరు గుర్తు పెట్టుకోండి. భగవంతుడితో మనకు ఉన్న సంబంధం తప్పించి మిగతావి అన్నీ నూటికి నూరుపాళ్ళు అబద్ధం. ఈ శరీరం ఎంత తాత్కాలికమైనదో, బంధుత్వాలు కూడా అంతే తాత్కాలికమైనవి. స్నేహాలు, విరోధాలు కూడా తాత్కాలికమైనవే. ఇవన్నీ నామరూపముల మీద ఆధారపడిన విషయాలు. మాయ

అంతా మనస్సులోనే ఉంది. మీకు ఎప్పుడైనా సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా అది మన శరీరానికి రాదు, మన కాళ్ళకు చేతులకు రాదు, మనస్సుకు వస్తుంది. ఎప్పుడైనా కోపం వచ్చినా, ద్వేషం వచ్చినా అదీ మనస్సుకే వస్తుంది. మనలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. ఆయన దర్శనం అవ్వకుండా మన మనస్సే మనకు అడ్డు వస్తోంది. అందుచేత మనస్సు అణగాలి. మనం పుట్టినప్పడే దేవుడు వచ్చాడు, మనం చనిపోయాక దేవుడు ఉండడు అని అనుకోకు. ఈ జీవకోటి అంతా ఆయనలో నుండే వచ్చింది. ఈ జీవకోటి అంతా ఎవరిలో నుండి అయితే వచ్చిందో ఆయనతో ఉన్న సంబంధం ఒక్కటే నిజమైన సంబంధం, మిగతావి అన్నీ అబద్ధాలే. మనకు కర్మఫలం పట్ల కాంక్ష ఉంది, దేహాభిమానం ఉంది, ఈ రెండూ కూడా భగవంతుడి వైపుకు మన ముఖాన్ని తిరగనివ్వవు. ఆత్మజ్ఞాన సముపార్జనకు ఇవి రెండూ ఆటంకాలు. ధర్మం అంటే ఒక జీవిత విధానం. ఎలా జీవిస్తే మనకు మోక్షం వస్తుందో ఆ రకంగా జీవిస్తే అది ధర్మం. సనాతనధర్మం అంటే మన ధర్మం ఇవాళ ఎవరో ప్రారంభిస్తే వచ్చినది కాదు, ఎవరో కనిపెడితే వచ్చినది కాదు, చిరకాలం నుండి కలకాలం నుండి ఉన్నదే ఈ ధర్మం. పూర్వం మడి, ఆచారాలు ఉండేవి. ఆహార నియమం ఉండేది. ఇవన్నీ మన పెద్దలు ఎందుకు ఏర్పాటు చేసారు అంటే ధర్మం యందు గౌరవం కలగటంకోసం ఇవన్నీ ఏర్పాటు చేసారు. ధర్మ, అర్థ, కామ, మోక్షములలో ముందు ధర్మమే ముఖ్యము. ధర్మాన్ని ఆచరించకుండా మీకు మోక్షం రాదు. మీరు భగవద్గీత, ఉపనిషత్‌లు చదివేస్తే మోక్షం వచ్చేయదు. శరీరానికి క్రమశిక్షణ ఉండాలి, మనస్సుకు క్రమశిక్షణ ఉండాలి. ఎక్కడో దేవుడు, స్వర్గము, నరకము, ఆలోకము, ఈలోకము గొడవలు వదిలెయ్యండి. చనిపోయిన తరువాత ఏమౌతాము అనే గొడవలు వదిలెయ్యండి. జీవిత విధానంలో మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం బాగాఉండాలంటే, మనస్సు నిశ్చలంగా నిర్మలంగా ఉండాలంటే, మీరు బతికిన పదిరోజులు సుఖమయంగా ఉండాలంటే భక్తి అవసరం. స్వస్వరూప అనుసంధానమే భక్తి. ఉపనిషత్‌లు అన్నీ ఋషుల యొక్క అభిప్రాయాలు, భగవంతుడి ముఖంలో నుండి వచ్చిన శాస్త్రం భగవద్గీత. మనం నేర్చుకొన్నది ఎలా ఆచరించాలి అని ఆచరణ భాగం అంతా భగవద్గీతలో సమన్వయం చేసాడు. ప్రపంచంలో లేనిది భగవద్గీతలో ఉండవచ్చు కాని భగవద్గీతలో లేనిది ఈ ప్రపంచంలో ఏమీ లేదు. కర్మయోగం అంతా మనం సత్కర్మ ఎలా ఆచరించాలి, మంచిని ఎలా

పెంచుకోవాలి, సమాజశ్రేయస్సు కోసం ఎలా జీవించాలి అని ధర్మం గురించి అంతా కర్మకాండలో చెప్పాడు. జ్ఞానకాండలో బ్రహ్మం యొక్క విశిష్టత అంతా చెప్పాడు.

మనకు ఎంతసేపు ఏదో రోజున స్మశానంలో దహించబడే ఈ దేహం గొడవే కాని అసలు లోచూపు మనకు లేదు. అసలు మనం ఎక్కడ నుండి వచ్చాము, ఎక్కడికి వెళ్ళాలి అనే విచారణ లేదు, భగవంతుడిని పొందాలి అనే జిజ్ఞాస లేదు. శ్రవణం లేదు, మననం లేదు, ధ్యానం లేదు. కంచిలో చీరలు నచ్చలేదు, బెనారస్‌లో చీరలు నచ్చలేదు, చీర ఇలా ఉండాలని ఆర్డర్ ఇచ్చి వచ్చాము అని చెపుతారు. ఈ శరీరాన్ని కప్పకోవటానికే ఇంత గొడవ అయితే ఇంక నీకు జ్ఞానం ఏమిటి? మీరు వంద రూపాయలు సంపాదిస్తే కనీసం పది రూపాయలు సమాజానికి ఉపయోగించాలి. మనం సమాజంకోసం ఏమీ చేయటం లేదు, దయాగుణం మనకు లేదు. స్వార్థాన్ని విడిచిపెట్టి నీ జీవితంలో ఒక్కరికైనా సహాయం చేసావా? ఏమీ లేదు. ఆచరణ భాగం సున్నా. ఏదో పుస్తకం చదవటం, బ్రహ్మజ్ఞానం వచ్చేయాలి అనుకోవటం, అలా రాదు అని చెపుతున్నాడు. పరమేశ్వరుడు ఒక మాట చెపితే ఆ మాట ఏ హృదయంతో చెప్పాడో అది మనకు అర్థం అవ్వాలి, దానిని అనుభవించాలి, ఆ మాటను మనం ఎంజాయ్ చెయ్యాలి. మాట దేవుడై ఉన్నది. మనకు ఎంతసేపు రూపబుద్ధి, నామబుద్ధి. ఇవి అన్నీ టెంపరరీ. కీర్తి నిలబడదు, అపకీర్తి నిలబడదు, గౌరవాలు నిలబడవు, ధనం నిలబడదు, లాభం నిలబడదు, నష్టం నిలబడదు. ఏదైతే తాత్కాలికమో దాని చుట్టూ తిరుగుతూ జీవితాన్ని వృథా చేసుకొంటున్నాము. రూపం అబద్ధం, నామం అబద్ధం. ఏదో శవం వస్తుంది, దానికి పేరు పెడతారు. ఆ శవం చుట్టూ, పేరు చుట్టూ తిరగడం. ఇంక మనస్సు ఎప్పుడు లోపలకు వెళుతుంది. మనలను బంధించేవి నామరూపములే, ఈ వలలో నుండి బయటకు రాలేకపోతున్నాము.

భగవంతుడు అనేక నామరూపములతో వస్తాడు. మనకు ఇష్టమైన నామాన్ని స్మరించుకొంటూ, ఆ రూపాన్ని ధ్యానం చేస్తే మన నామరూపముల నుండి విడుదల పొందుతాము. ఈ ప్రపంచానికి మనం దగ్గరయ్యే కొలది భగవంతుడికి దూరం అవుతాము. ఈ ప్రపంచంలో మనం చేయవలసిన పని చేసి వదిలేయాలి. మన డ్యూటీ మనం చేయాలి, 24 గంటలు ప్రపంచ విషయాలలో ఉండకూడదు. పరమేశ్వరుడిని స్మరించి, ఆయనను ధ్యానించి మనలో ఉన్న జీవలక్షణాలను పోగొట్టుకోకపోతే దైవస్వరూపం మనకు దొరకదు,

జననమరణ చక్రంలో నుండి మనం బయటకు రాలేము. భగవద్గీతలో గుణాల గురించి ఎక్కువ చెప్పాడు. తమోగుణం ఉన్నవాడు ఎప్పడూ డల్‌గా ఉంటాడు, ఎప్పడూ తిండి, నిద్ర గొడవలో ఉంటాడు. రజోగుణం ఉన్నవాడు కోరికలతో ఉంటాడు. కోరికతో పని చేస్తాడు. ఈ పని చేస్తే మనకు ఏమి కలిసివస్తుంది అని చూస్తాడు. వాడి కోరికలే వాడిని బంధిస్తూ ఉంటాయి. సత్వగుణం అంటే మంచితనం, వివేకం. ఇలా ఏవో మంచిమాటలు వింటామ అనుకోండి. ఇది మంచి, ఇది చెడ్డ అని మనకు తెలుస్తూ ఉంటుంది, అదే వివేకం. వివేకం మంచిదే కాని వివేకం ఉన్నవాడు ఎప్పడు ఆచరిస్తాడు అంటే ఈశ్వరుడి దయ వలన వాడికి వైరాగ్యం వస్తే ఆచరించటం ప్రారంభిస్తాడు. కొంతమంది భార్య ఉన్నతంసేపు భార్య చుట్టూ తిరుగుతారు, భార్య చనిపోయాక కొడుకులు, కోడళ్ళు పట్టించుకోరు, అప్పడు కొంత వైరాగ్యం వచ్చి మంచి పనులు చేస్తారు. కొంతమంది ఇంట్లోవారి మీద కోపంతో మంచి పనులు చేస్తారు. ఇదంతా వివేకంతో చేస్తున్నారు అని చెప్పలేము. ఈ లోకం మీరు చేసే పనులు చూస్తుంది కాని భగవంతుడు మీరు ఏ ఉద్దేశ్యంతో ఆ పనులు చేస్తున్నారో చూస్తాడు, దానిని బట్టి మీకు స్పిరిట్యువల్ స్టేటస్‌ను ఇస్తాడు, వాడు అంతర్యామి. వివేకం వలన వచ్చిన వైరాగ్యం నిలబడుతుంది కాని కోపం వలన వచ్చిన వైరాగ్యం నిలబడదు. ఇది మంచిపని అని మనకు తెలిసినా ఆ పని మనం చెయ్యలేము, వాసన యొక్క వేగం మనలను చెయ్యనివ్వదు. మనకి ఏ తలంపు వస్తే ఆ క్షణంలో అది ఒక్కటే నిజం అని మనకు అనిపిస్తుంది, తలంపు యొక్క వేగం అట్టిది, మనం ఏ రకంగా పని చెయ్యాలి, ఎలా జీవిస్తే మనం బాగుపడతాము, భక్తిని ఎలా పెంచుకోవాలి, ప్రేమను ఎలా పెంచుకోవాలి ఇవిఅన్నీ భగవంతుడు చెప్పాడు. ఇక్కడ మన తలకాయ అనవసరం. భగవంతుడు ఇది మంచి అని చెపితే చేసేయటం, ఇది చెడ్డ అని చెపితే దానిని వదిలేయటం. మీలో ఎవరికైనా దుఃఖం వస్తోంది అనుకోండి. ఫలానా రకంగా వారు ప్రవర్తించారు అందుచేత వారికి దుఃఖం వస్తోంది అని ఆరకంగా మనం ప్రవర్తించటం మానివేయాలి. ఎందుచేతనంటే మనం అదేరకంగా ప్రవర్తించాము అనుకోండి, మనకు కూడా దుఃఖం వచ్చేస్తుంది. భగవంతుడు చెప్పిన పనిని మనం చేస్తూ ఉంటే మీరు ఈ లోకంలో సుఖపడటమే కాదు, శాంతిగా ఉండటమే కాదు, భగవంతుడి స్వరూపమైన మోక్షం కూడా పొందుతారు. భగవంతుడు వద్దని చెప్పిన పనిని చేస్తూ ఉంటే నీచజన్మలు వస్తాయి, చివరకు మనకు నరకమే గతి. ధర్మం ఎటువంటిది అంటే మీరు ధర్మాన్ని ఆచరిస్తే

మోక్షాన్ని రుచిచూస్తారు అని గౌతమబుద్ధుడు చెప్పాడు. సముద్రం నీరు నోటిలో పోసుకొంటే ఉప్పగా ఉండటం ఎంత సహజమో ధర్మాన్ని ఆచరించేవాడు మోక్ష సుఖాన్ని, నిర్వాణసుఖాన్ని రుచి చూడటం కూడా అంతే సహజం అని బుద్ధుడు చెప్పాడు. ఆహారవిషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆహారశుద్ధి లేకుండా బుద్ధి శుద్ధి అవ్వదు. ఏదో ప్రాణాయామం చేస్తున్నానని ఏ గడ్డి పడితే ఆ గడ్డి తినేస్తూ ఉంటే దాని వలన ఆధ్యాత్మికపురోగతి ఆగిపోతుంది. మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇప్పుడు మనం మాట్లాడుతున్నాము అనుకోండి. అవసరం ఉండి మాట్లాడుతున్నామా లేకపోతే అహంకారం పెంచుకోవటానికి మాట్లాడుతున్నామా అని మనం చూసుకోవాలి. అవసరం లేకుండా మాట్లాడుతూ ఉంటే శక్తి వృధా అవుతుంది. నీవు మాట్లాడుతూ ఉంటే నీ ప్రక్కవాడికి ఆ మాట ఉపయోగపడాలి, వాడు బాగుపడటానికి ఆ మాట సహకరించాలి. నిద్ర విషయంలో జాగ్రత్తగా ఉండాలి, అతినిద్ర పనికిరాదు. కొంతమంది సహజంగా పనిచేస్తారు, సహజంగా జీవిస్తారు, కృత్రిమంగా మాట్లాడరు, గర్వం ఉండదు, మాటచేత అన్నీ నిరాడంబరంగా ఉంటాయి. మనం చెప్పేమాట ఎదుటివాడికి ఎంతవరకు ఉపయోగపడుతోంది అని ఆలోచిస్తూ వాడి స్థాయికి దిగివచ్చి మాట చెపుతారు. ఇదంతా సత్వగుణం ఉన్నవాడి లక్షణం. ఏవో పాండిత్యం మాటలు చెప్పటం కాదు ఎదుటివాడికి అర్థమయ్యేలాగ, వాడి క్షేమం కోరి మాటలు చెప్పాలి. నువ్వు బాగుపడటానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నావో వాడు బాగుపడటానికి కూడా అంత ప్రాముఖ్యత ఇచ్చి చెప్పాలి. వాడు నీతో సమానస్థాయికి వస్తే నువ్వు సంతోషించాలి కాని నేను ఏదో ఉద్ధరిస్తున్నాను అని అనుకోకూడదు.

కర్మఫలితానికి నీవు కారకుడవు అవ్వకుండా చూసుకో. కర్మఫలితానికి నువ్వే కారకుడవు అనుకొంటే జన్మలు పెరిగిపోతాయి, ప్రకృతి నిన్ను విడిచిపెట్టదు. కర్మఫలితం పట్ల ఆసక్తి పెట్టుకోవద్దు, అలాగని చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టవద్దు. కర్మని యోగంగా చేస్తే నీకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. ఒక మనిషి మీద మనకు ప్రేమ ఉంది అనుకోండి, ఆ ప్రేమకు కారణం కనబడకూడదు, అప్పుడు అది నిజమైన ప్రేమ. కారణం ఉంటే ఆ కారణం నెరవేరినప్పుడు ప్రేమ కూడా పోతుంది. పరమేశ్వరుడిపట్ల ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి, కారణం కనబడకూడదు, అది భక్తియోగం, అప్పుడు నీకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. మనిషి పాడైపోవటానికి లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. వాటిని తట్టుకోవటానికి సత్పురుషులతో సహవాసం చెయ్యి. మహాత్ముల దగ్గరకు, యోగుల దగ్గరకు వెళ్ళినప్పుడు తీర్పులు చెప్పవద్దు,

వారి దగ్గర నుండి నేర్చుకొని బాగుపడండి. కృష్ణుడు అట్టివాడు, ఇట్టివాడు అని ఆయన మీద జడ్జిమెంట్స్ చెపుతూ ఉంటే భగవద్గీత మీకు ఏమి అర్థమవుతుంది. ఇప్పుడు నీకు దేహంతోటి, మనస్సుతోటి ఎరుక ఎలా ఉందో అలాగ నీ లోపల ఉన్న సద్వస్తువుతో ఎరుక కలిగే వరకు బాహ్యంగా ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. కర్మఫలితం మీద ఆసక్తి పెట్టుకోవద్దు, అలాగని కర్మని విడిచిపెట్టవద్దు అని మీకు మాటలు చెపుతూ ఉంటే మీకు తలుపు సందున పెట్టి నొక్కినట్లుగా ఉంటుంది. ఈ రకంగా జీవిస్తేనే మనలో ఉన్న అజ్ఞానం పోతుంది, ఈశ్వరుడు మనకు వ్యక్తమవుతాడు. లోపల ఉన్న విషం, కల్మషం అంతా బయటకు పోవాలి కదా. కర్మఫలితానికి కారకుడవు అయ్యావా, ఒకవేళ నీవు మంచిపని చేస్తున్నా పతనం ప్రారంభమవుతుంది. మన మనస్సులో అనేక బలహీనతలు ఉన్నాయి అనుకోండి. ఆ బలహీనతల నుండి ఎలా విడుదల పొందాలి, ఏ రకంగా జీవిస్తే ఆ బలహీనతలు నశిస్తాయి అనేది మనకు భగవద్గీతలో దొరుకుతుంది. ఆధ్యాత్మికంగా మీకు ఏవైనా సందేహాలు వస్తూ ఉంటే, సాధన చేసేటప్పుడు సందేహాలు వస్తూ ఉంటే ఏదో ఒక శ్లోకం మీ సందేహాన్ని నివృత్తి చేస్తుంది, భగవద్గీత యొక్క వైభవం అట్టిది. ఆసక్తి పెట్టుకోకుండా పనిచెయ్యి, అనురాగం పెట్టుకోకుండా పనిచెయ్యి, అప్పుడు నీవు నిర్మలమవుతావు, నిశ్చలమవుతావు. నీ మనస్సు నిర్మలమయ్యేకొలది, నిశ్చలమయ్యేకొలది, లోపల ఉన్న జ్ఞానగంగ నీకు దొరికేకొలది నీలో ఉన్న వాసనలు ఒకో వాసన, ఒకో వాసన నశిస్తాయి. ఎప్పుడైతే వాసనాక్షయం అయ్యిందో ఈ శరీరంలో ఉండగానే నువ్వు నిర్వాణసుఖాన్ని పొందుతావు.

మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఈ శరీరానికి మరణం వచ్చే రోజుకు నూటికి నూరుపాళ్ళు సుఖంగా, ఆనందంగా ఉంటే వాడికి పునర్జన్మ లేదు. ఎందుచేతనంటే వాడికి ఏడ్చేపనిలేదు. ఏడుపు మిగిలిఉంటే ఏడవటానికి మరల జన్మను ఇస్తాడు. మీకు దుఃఖం అంతా ఖర్చు అయిపోయింది అనుకోండి ఇంక శరీరంలోనికి రావలసిన పనిలేదు. మొన్న హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఎవరో పాట పాడారు. ఏటిగట్టు వంకరలు, వంకరలుగా ఉన్నా నీరు వంకరగా ఉంటుందా అని, దాని అర్థం ఏమిటి అంటే నీ దేహం వేరుగా ఉండవచ్చు, నా దేహం వేరుగా ఉండవచ్చు, మీ గుణాలు వేరుగా ఉండవచ్చు, నా గుణాలు వేరుగా ఉండవచ్చు, రంగులు వేరుగా ఉండవచ్చు కాని అందరి హృదయాలలో ఉన్న పరమేశ్వరుడు వేరు వేరుగా లేడు, ఒకటిగానే ఉన్నాడు. మన గుణాలు వేరుగా ఉన్నా

మన హృదయంలో ఉన్న పరమేశ్వరుడు సమానంగానే ఉన్నాడని చెప్పటం. మంచివాడిలో ఏ పరమేశ్వరుడు అయితే ఉన్నాడో చెడ్డవాడిలో కూడా ఆ పరమేశ్వరుడే ఉన్నాడు. చెడ్డవాడి యొక్క మనస్సు వంకరగా ఉంది కాని వాడిలో ఉన్న పరమేశ్వరుడు వంకరగా లేడు. మంచి వాడికి చెడ్డవాడికి తేడా ఏమిటి అంటే మంచివాడికి వాడిలో ఉన్న పరమేశ్వరుడు అనుభవం లోనికి వస్తాడు, వాడు సుఖి అవుతాడు. చెడ్డవాడికి హృదయంలో ఉన్న పరమేశ్వరుడు వాడికి దొరకడు, అందుచేత దుఃఖం వాడిని విడిచిపెట్టదు. మీ మనస్సు కదులుతోంది అనుకోండి అక్కడ ఇష్టం అయినా, అయిష్టం అయినా ఉంటుంది. మీకు ఇష్టం లేదు అనుకోండి, అయిష్టం లేదు అనుకోండి మీ మనస్సు కదలమన్నా కదలదు.

మొత్తం సొత్తు అంతా భగవంతుడిదే. ప్రారబ్దాన్ని బట్టి మనకు కొంత కేటాయించాడు. ఆ కేటాయించినది కూడా ఆయనదే. ఆయన ఇచ్చినది మనం అనుభవిస్తున్నాము. మనం తినే అన్నం కూడా మన సొంతం కాదు. ఆయన ఇచ్చినదే మనం తింటున్నాము, అలా అనుకొని తింటే అది ప్రసాదమవుతుంది. అది పరమేశ్వరుడిది కాదు, నాది అనుకొని తింటే నువ్వు దొంగతోటి సమానము. మన సొంతం అంటూ ఏమీ లేదు. అంతా ఈశ్వరుడిదే. మొత్తం ఈ సృష్టి రూపంలో ఉన్నవాడు ఆయనే. మనచేత చూడబడుతున్న ప్రపంచం కూడా ఈశ్వరుడే. అయితే ట్రైనింగ్ పొందటం కోసం మనం ఇక్కడకు వచ్చాము అని గుర్తు పెట్టుకోవాలి. బాధపడే వాడిని చూసి అయ్యో అని కూడా అనలేవు, నాకు దయ ఉంది అనుకొంటావు. అలాకాదు నీవు దయను ప్రాక్టీసు చేయాలి. అందరి జీవితాలు, లోకం యొక్క పోకడ అంతా కూడా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది. ఇదంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తోంది అని మీకు అనుభవానికి వస్తే ఇంక ఏ విషయంలోను అశాంతి ఉండదు. తేడా అల్లా నామరూపములే, ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే అని మీకు అర్థమైతే మీ సాధనతో నిమిత్తం లేకుండా ఇప్పుడే అశాంతి నశిస్తుంది, దుఃఖం నశిస్తుంది. మాలో ఈ మంచిగుణాలు ఉన్నాయి, ఆ మంచిగుణాలు ఉన్నాయి అని మీలో మీరు గాలిమేడలు కట్టుకోవద్దు. ప్రాక్టీసు చేస్తే మీరు ఫెయిల్ అయిపోతారు. భగవద్గీతలో చెప్పిన వాక్యాలను తీసుకొని ప్రాక్టీసుచేయటం మొదలుపెడితే అందులో ఉన్న ఇబ్బంది, వాటి యొక్క లోతు ఏమిటో అప్పుడు మీకు తెలుస్తుంది. ఈలోకం వేరు, నేను వేరు, ఎక్కడో దేవుడు ఉన్నాడు అని మనకు అనిపిస్తుంది. ఇదంతా మనస్సు యొక్క గారడీ, ఇదంతా మనస్సు యొక్క

కల్పితమే. నీ మనస్సు వెళ్ళి బ్రహ్మంలో ఐక్యంఅయ్యాక నీకు ఉన్న బేదబుద్ధి నశిస్తుంది, బ్రహ్మం కంటే భిన్నంగా ఏదీ లేదు అన్న సంగతి బ్రహ్మానుభవం కలిగాక నీకు తెలుస్తుంది. అప్పుడు జీవించి ఉండటానికి, మరణించటానికి మధ్యన ఉన్న బేధం నశిస్తుంది.

భగవంతుడు ఒకో శరీరానికి ఒకో పనిని కేటాయిస్తాడు. మన శరీరానికి ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని హృదయపూర్వకంగా నిండుమనస్సుతో, అయిష్టం లేకుండా ఇష్టంతో కనుక చేస్తే అప్పుడు ధర్మం మనలను రక్షిస్తుంది. ఎవడికైతే ధర్మంయందు గౌరవం ఉందో, ఎవడైతే ధర్మాన్ని కాపాడుతున్నాడో వాడినే ధర్మం రక్షిస్తుంది. ధర్మం యందు గౌరవం లేనివాడిని ధర్మం రక్షించదు. కర్ణుడి రథచక్రం దిగిపోతుంది, దానిని తీసుకొంటూ ఉంటాడు, అలా ఉండగా వాడిని చంపేయమని కృష్ణుడు అర్జునుడితో చెపుతాడు. అప్పుడు కర్ణుడు ధర్మశాస్త్రం గురించి చెపుతాడు. అప్పుడు కృష్ణుడు ఏమన్నాడు అంటే నీవు నోటితో ధర్మం గురించి చెపుతున్నావు. నీకు ధర్మం యందు అసలు గౌరవం ఉందా, నిండుసభలో ద్రౌపది వస్త్రాలు వలిచినప్పడు తప్ప అని చెప్పావా? అభిమన్యుడిని అన్యాయంగా చంపినప్పడు తప్పని చెప్పావా? పాండవులను చాలా క్రూరంగా అగౌరవపరిచారు కౌరవులు, అప్పడు ఇది ధర్మ విరుద్ధం అని ఎప్పడైనా చెప్పావా? కౌరవులు చేసిన అన్ని అన్యాయపుపనులకు నువ్వు సిద్ధమయ్యావు. ఇప్పడు ధర్మశాస్త్రం గురించి చెపుతున్నావు. నీకు ధర్మంయందు గౌరవం ఉంటే నువ్వు ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే అర్జునుడు ఎవడు? నేను ఎవడిని? ధర్మమే నిన్ను రక్షిస్తుంది. అందరి విషయంలోను మీరు అధర్మంగా ప్రవర్తించి మీ సొంత విషయం వచ్చేటప్పటికి ధర్మం, ధర్మం అంటే ఆమాటకు అర్థం ఏమిటి? అదీ కృష్ణుడు చెప్పేది. కొంతమంది దగ్గరకు మనం ఏమీ తీసుకొని వెళ్ళకపోయినా, వారు వచ్చి మనలను చూసి వెళ్ళారు కదా అని తృప్తిపడతారు. మన చేతిలో ఆకు లేకపోవచ్చు, నీరు లేకపోవచ్చు, అలాగే భగవంతుడిని దర్శించుకొని రావటం వలన కూడా మనకు సద్బుద్ధి కలుగుతుంది. మనం పవిత్రులమవుతాము. జీవితంలో మనం నేర్చుకోవలసినవి రెండే రెండు విషయాలు 1. చేతులతో మంచి పనులు చేస్తూ ఉండాలి, 2. మనస్సుతో భగవంతుడిని స్మరించుకొంటూ ఉండాలి. అలా ఉంటే మనం పవిత్రులం అవుతాము. మన పవిత్రత బ్రహ్మజ్ఞానం పొందటానికి దారి చూపిస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 09-03-07 శుక్ర | జిన్నూరు, రమణ క్షేత్రం |
| 11-03-07 ఆది | చించినాడ, గీతామందిరం |
| 18-03-07 ఆది | పాలకొల్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్, బస్టాండ్ వెనుక (మధ్యాహ్నం 3 గంటలకు) |
| 28-03-07 బుధ | గొల్లలమామిడాడ, తూర్పు గోదావరి జిల్లా |
| 31-03-07 శని | ముమ్మిడివరం, తూర్పు గోదావరి జిల్లా |
| 04-04-07 బుధ | గుండుగొలను |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## క్రోధానికి కోత, అనుగ్రహానికి దాత "గురు స్వరూపం"

జీవుడు తరించే యోగం తటస్థిస్తే సద్గురువుతో ఈశ్వరుడు అనుసంధానం చేస్తాడు. సంస్కారాలు పూర్తిగా నిర్మూలించటం ఇది సద్గురువు కరుణా కటాక్షం ద్వారా జరుగుతుంది. గుడ్డివాడు సూర్యోదయమును ఎదురుగా ఉన్ననూ చూడలేనట్లే. అలాగే అదృష్టం లేనివారు గురువు యొక్క శ్రేష్ఠమైన రూపమును కానలేరు. పవిత్ర గ్రంధాలు ఆత్మానుభూతిని వివరిస్తాయి. మహాత్ములు మానవ రూపంలో ఉన్న పవిత్ర గ్రంధాలు. పవిత్ర గ్రంధాలు వారి నుండే వెలువడుతాయి. అంతకన్న వారు అధికులు కూడా వారు మోక్ష మార్గాన్ని చూపేవారే కాదు మోక్షాన్ని ఇచ్చేవారు కూడా వారే. శ్రీ నాన్నగారు "గురువు సాధన చెయ్యమని చెప్పడు, అనుగ్రహాన్ని ఇవ్వటమే. సముద్రానికి హద్దులు ఉన్నాయి, జ్ఞాని అనుగ్రహానికి హద్దులు లేవు. మనం ఎక్కడ ఉన్నా అందుతాయి. జ్ఞానితో మీరు మానసిక అనుబంధాన్ని ఏర్పాటు చేసుకోండి. ఒడ్డుకు చేరుస్తాడు. అది ఆయన పని" అన్నారు. గురు గీతలు "సద్గురువు యొక్క పాదములను తాకిన అన్ని పుణ్య క్షేత్రాలు దర్శించిన ఫలం, అన్ని నదులలో స్నానం చేసిన ఫలం కలుగుతుంది. ఎల్లప్పుడు గురు నామాన్ని జపించు, గురు రూపాన్ని చింతించు. గురువు యొక్క ఆజ్ఞా ప్రకారం నడవాలి. ఆపద వచ్చినప్పుడు సర్వ ధర్మ స్వరూపుడైన గురువే బంధువుగా అగుచున్నాడు. గురు పాదమే పూజించుటకు యోగ్యము. గురు వాక్యమే మంత్రము. ఈశ్వరుడు అనుగ్రహించినను గురువు కనికరించి రక్షిస్తాడు, గురువు ఆగ్రహిస్తే ఈశ్వరుడు కూడా రక్షించలేడు" అంది. నిజం ఏమిటి అంటే సద్గురువు కటాక్షం చేతనే బంధాలు అన్ని నశించి పోతాయి. శ్రేయములు అన్నీ స్వయంగా వచ్చి చేరుతాయి. గురువు యొక్క ఉపదేశము లేకున్నచో కోట్ల కల్పములైనను తత్వ జ్ఞానం కలుగదు. మనచేత గురువు నామమాత్రంగా సాధన చేయించి, కామాదులను నశింపచేసి ముక్తిని ప్రసాదిస్తారు. కామానికి వాత, క్రోధానికి కోత పెట్టి తన అనుగ్రహంతో తన అంతవానిగా చేస్తాడు. త్రిమూర్తుల స్వరూపమే గురు స్వరూపము.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం



దిll 05-02-07న పాలమూరు కళ్యాణ మండపం ప్రారంభించిన మాజీ మంత్రి
చింతలపాటి మూర్తిరాజుగారు మరియు సద్గురు శ్రీ నాన్నగారు



పాలమూరు సభకి సద్గురు శ్రీ నాన్నగారిని ఆహ్వానిస్తున్న
రిటైర్డ్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీ కలిదిండి నర్శింహరాజుగారు